'నిబంధనల ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ'

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 3: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ల్యాండ్ రెగ్యులరైజేషన్‌స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియ పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి భట్టి, భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల స్ర్కూటినీకి అవసరమైన సపోర్టు సిస్టం అధికారులకు అందిస్తామన్నారు. 2020నాటికి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలని, మార్చి 2025నాటికి పూర్తిస్థాయిలో సమస్యల్ని పరిష్కరించాలని అధికారులను మంత్రులు ఆదేశించారు.

నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం



స్నేహమంటే ఇదేరా..

- చెరిగిపోని మధుర జ్ఞాపకం
- ఎన్నటికీ వీడని బంధం



ప్రపంచంలో ధనం, సంపద లేనివాళ్లు ఉండొచ్చు కానీ స్నేహితులు లేనివారు ఉండరు. బాల్యం మొదలు వృద్ధాప్యం వరకు ఆయా దశల్లో అనేక మంది స్నేహితులవుతుంటారు. మన చుట్టు పక్కల ప్రాంతాలు, స్కూలు, కాలేజీ, పని చేసే ప్రదేశాలు.. ఇలా ప్రతీ చోట ఎందరో పరిచయమవుతుంటారు. కానీ వారిలో కొందరు మాత్రమే మిత్రులవుతారు. వీరిలో ఇంకొందరు చిరకాల స్నేహితులుగా మిగులుతారు. ఆప్త మిత్రులుగా వెంట నిలుస్తారు. మన గమ్యానికి దిక్సూచిగా నిలుస్తూ కష్టాల కడలిలో వెన్నంటి ఉంటారు. అందుకే స్నేహితుడు అంటే ఒక భరోసా.. ఒక నమ్మకం.. ఒక ఆలంబన.. ఒక స్ఫూర్తి ప్రదాత కూడా. అంతే కాదు కన్నవారితో, కట్టుకున్నవారితో, తోడబుట్టినవారితో సైతం చెప్పులేని విషయాలను కూడా స్నేహితులతో చెప్పుకోగలుతామంటే స్నేహం గొప్పతనం అది. ఎంతో అందమైన.. అపురూపమైన.. విలువైన స్నేహాన్ని పొందడం ఓ అదృష్టంగా చెబుతుంటారు. స్నేహానికి హద్దులు లేవు. పరిమితులు అంతకన్నా లేవు. వయోబేధం లేదు. ఆస్తి, అంతస్థు, హోదా, అధికారం ఇవేవీ అడ్డు కావు. మంచి స్నేహితుడు తోడుగా ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదన్నది జగమెరిగిన సత్యం.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

వివరాలు : 7లో..

ఆంధ్రజ్యోతి సందర్భం



కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలు





గణపురం మండలం గాంధీనగర్ గుట్టపై మొక్క నాటుతున్న మంత్రులు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గణపురం, ఆగస్టు 3: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ధనసరి సీతక్క పేర్కొన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని గాంధీనగర్ గుట్టల వద్ద ఏర్పాటు చేసిన ఇండస్ట్రీయల్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎంపీ కడియం కావ్య, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలతో కలిసి తొలుత వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

అనంతరం ఇండిస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన చేసి బహిరంగ సభలో మాట్లాడారు. జిల్లాలో ఇండస్ట్రీయల్ పార్కుతో అభివృద్ధి మరింత జరిగి యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. సుమారు 60 ఎకరాల్లో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రజల దీవెనలతోనే ఇందిరమ్మ రాజ్యం వచ్చింది: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



రాష్ట్ర ప్రజల దీవెనలతోనే ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాలో పేదోడి ఆలోచనలకు అనుగుణంగా ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు కానుందన్నారు. రైతులను రాజుగా చేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలను తూచా తప్పకుండా రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటలకు ఇన్సూరెన్స్, విత్తనాల సబ్సిడీలు ఇస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ఏ వేదిక ఎక్కినా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం గురించి చెప్పారని, సొంత నియోజకవర్గంలో నిర్మించిన ఇళ్లను పేపర్లలో ఫొటోలు వేయించుకుని ప్రజలను మభ్యపెట్టి ఓట్లు అడిగారన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ 1.50 లక్షల ఇళ్లు మాత్రమే నిరిస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం 4.50 లక్షల ఇళ్లు నిర్మించబోతుందని పేర్కొన్నారు. కేంద్రం రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో తెలంగాణ పేరు కూడా ఎత్తకుండా తొండాట ఆడుతుందన్నారు. ఈ నెలాఖరు లోపు రాష్ట్ర వ్యాప్తంగా రైతుల రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

ప్రతీ వాగ్దానానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



ప్రజలకు ఇచ్చిన ప్రతీ వాగ్దానానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్కొక్కటి అమలు చేస్తున్నామన్నారు. భూపాలపల్లి జిల్లాలో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు ఉన్నా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాలో ఒక్క ఎకరానికి కూడా నీరివ్వలేదన్నారు. అశాస్త్రీయంగా బ్యారేజీలు నిర్మించగా అవి కుంగిపోతే కాంగ్రెస్ కుట్ర చేసిందని అనడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ కుట్రచేసే ఉంటే అక్కడ పునాదే పడేది కాదని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో 63కోట్ల ప్రయాణాలు జరిగాయని తెలిపారు.

మంత్రి సీతక్క, సీఎం రేవంత్ రెడ్డి మహిళలను లక్షాధికారులను చేస్తాం అంటే ప్రతిపక్షాలు నవ్వారని, ఈ రోజు కోటి మంది స్వశక్తి మహిళా గ్రూపు సభ్యులుగా చేర్చి మహిళలను లక్షాధికారులుగా చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలను కూడా పెంచుతామని, ఐటీ అధిపతులతో మాట్లాడి ఐటీ కంపెనీలు కూడా తీసుకువస్తామన్నారు. ధరణిని ప్రక్షాళన చేసి ప్రజలను అధికారులు, నాయకుల చుట్టూ తిరగకుండా చేస్తామన్నారు.

- ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో యువతకు ఉపాధి
- భూపాలపల్లి జిల్లాలో రెండు బ్యారేజీలున్నా ఎకరానికి కూడా నీరివ్వలేదు..
- నెలాఖరులోపు రుణ మాఫీ ప్రక్రియ పూర్తి
- ఇచ్చిన ప్రతీ వాగ్దానానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపనలో మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, సీతక్క

పదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు : మంత్రి సీతక్క

బీఆర్‌ఎస్ ఉద్యోగాల నినాదందో తెలంగాణ ఉద్యమం చేశామని చెప్పి.. రాష్ట్రం, ప్రభుత్వం వచ్చాక పదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని మంత్రి సీతక్క విమర్శించారు. ఉపాధి అవకాశాల వేటలో చాలా మంది పట్టణాల బాట పడుతున్నారని, ఇలా గ్రామీణ ప్రాంతాల్లో



ఇండస్ట్రీయల్ పార్క్‌లు ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. ములుగులో కూడా నేషనల్ హైవేకు దగ్గరలో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రుణమాఫీ జరిగిందని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తున్నామన్నారు. అధికారం పోయిందనే అక్కసుతో బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని, అనేక హామీలు ఇచ్చి ప్రజలను, నిరుద్యోగులను మోసం చేసిందన్నారు.

స్కిల్ ఇండియా పేరుతో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించామన్నారు. ఇటీవల జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తే తట్టుకోలేకనే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని అన్నారు. ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంటుందని ఆకాక్షించారు.

కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

బాలికల సమగ్రాభివృద్ధికి స్నేహ ప్రోగ్రాం : కలెక్టర్

యూనిసెఫ్ సహకారంతో తొలి పైలెట్‌గా వరంగల్ జిల్లా ఎంపిక

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 3: కౌమార దశ బాలికల సమగ్రాభివృద్ధికి (సేఫ్టీ న్యూట్రిషన్ ఎంపవర్‌మెంట్ హెల్త్ ఆఫ్ అడోలోసెంట్స్) స్నేహ పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యూనిసెఫ్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తొలిసారి వరంగల్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి, జిల్లా వ్యాప్తంగా కౌమార దశలో ఉన్న బాలికల ప్రతిభను ప్రోత్సహించడంతోపాటు వారి అభివృద్ధి దోహదం చేస్తాయన్నారు. బాల్యవివాహాలు నిరోధించడం, రక్తహీనత, పోషకాహార లోపం, ఇతర ఆరోగ్య సమస్యలు పరిష్కరించడం, డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కల్పించడం, నాణ్యమైన విద్య, వృత్తి శిక్షణ అందించడంతోపాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ చైర్మన్‌గా, డీఆర్‌డీవో కన్వీనర్‌గా, 15 డిపార్ట్‌మెంట్‌లకు చెందిన ఉన్నతాధికారులతో కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, యూనిసెఫ్ చీఫ్ కో ఆర్డినేటర్ మురళీ కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 3: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నూతన ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై అభిప్రాయాలను ఈనెల 23 వరకు సమర్పించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ నిర్వహించారు. మిట్టల్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తర్వాత సంబంధిత దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి పరిష్కరించాలని సూచించారు. నూతన ఆర్‌ఓఆర్ చట్టం అమలులోకి వచ్చేలోపు పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించి, మరో మూడు వారాల వ్యవధిలో పరిష్కారమవ్వాలని ఆదేశించారు. ఆర్‌ఓఆర్ ముసాయిదా బిల్లుపై ప్రజలు తమ సలహాలు, సందేహాలు, అభిప్రాయాలను సీసీఎల్‌ఏ వెబ్‌సైట్ www.ccla.telangana.gov.in లేదా ror-rev@telangana.gov.in మెయిల్ ద్వారా ఈ నెల 23 వరకు తెలియాజేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, ఏఓ శ్రీకాంత్, విశ్వనారాయణ, రమేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

'స్వచ్ఛదనం.. పచ్చదనం'ను జయప్రదం చేద్దాం..

వివిధ విభాగాల అధికారులతో మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 5 నుంచి 9వరకు 'స్వచ్ఛదనం.. పచ్చదనం' కార్యక్రమాలు పండగలా నిర్వహించనుందని, ఈ ఐదు రోజుల కార్యక్రమాలను అన్ని విభాగాలు సమన్వయంలో నిర్వహించాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. శనివారం బల్దియా కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశంలో రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఐదు రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రేటర్‌లోని స్థానిక కార్పొరేటర్లు, ప్రజల భాగస్వామ్యంలో నిర్వహించే కార్యక్రమాలు విజయవంతం చేయాలని అన్నారు. 66 డివిజన్‌లకు 66 మంది ప్రత్యేక అధికారులను నియమించామని, అధికారులు మిగతా విభాగాల అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఐదు రోజుల కార్యక్రమాల షెడ్యూల్ వివరాలను వెల్లడించారు.

కార్యక్రమంలో అదనపు కమి షనర్ కృష్ణారెడ్డి, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మ ల్లం రాజేశ్, సిటీ ప్లానర్ శైలజ, డిప్యూటి కమిషనర్లు రవీందర్, ప్రసన్నరాణి, టీపీఆర్‌వో రాజేశ్, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్, మెప్మా టీఎంసీ రమేష్ పాల్గొన్నారు.

పేటలో గంజాయి ఘాటు

» అక్రమ రవాణాకు అడ్డాగా నర్సంపేట » మూడేళ్ల నుంచి పెరిగిన దందా » యువతే లక్ష్యంగా విక్రయాలు



నర్సంపేటటౌన్, ఆగస్టు 3: నర్సంపేట కేంద్రంగా మళ్లీ గంజాయి వాసన గుప్పుమంటోంది. కొంత కాలంగా గంజాయి అక్రమ రవాణాకు అడ్డాగా మారుతోంది. నాలుగేళ్ల నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలైన సిలేరు, మోతుగూడెం, వైజాగ్, భద్రాచలం తదితర ప్రాంతాల నుంచి ఎండు గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్రైవేట్ వాహనాల్లో నర్సంపేట మీదుగా వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, ఖమ్మం, జనగామ, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారులు దాడులు నిర్వహించిన గంజాయి పట్టివేతలు, విక్రేతల అరెస్టులు జరిగినా అక్రమ దందా మాత్రం ఆగకపోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. నకిలీ నెంబర్ ప్లేట్లతో వాహనాలలో పెద్ద ఎత్తున ఎండు గంజాయిని తరలిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా శనివారం నర్సంపేటలోని మల్లంపల్లిరోడ్ కారులో తరలిస్తున్న 250కిలోల ఎండు గంజాయిని పోలీసులు పట్టుకోవడం ఆందోళన కలిగించింది.

సాగులేకున్నా... అక్రమ రవాణా...

రెండు దశాబ్దాల క్రితం గంజాయి కోటగా నర్సంపేట పేరుగాంచింది. ఎక్సైజ్, పోలీసుల గంజాయి సాగుపై ఉక్కుపాదం మోపడంతో కొన్నేళ్లుగా సాగు కావడం లేదు. అయితే మూడేళ్ల నుంచి గంజాయి అక్రమ రవాణాకు స్మగ్లర్లు నర్సంపేటను అడ్డాగా మార్చుకోవడం ఆందోళన కలిగిస్తోంది. స్మగ్లర్లు గతంలో రైలు మార్గాన్ని ఎంచుకుంటే, ఇప్పుడు రోడ్డు మార్గంలో ప్రైవేట్ వాహనాల్లో ఎవరికీ అనుమానం రాకుండా నర్సంపేట మీదుగా వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

యువతే లక్ష్యం..

పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ విద్యార్థులు, యువతే లక్ష్యంగా గంజాయి స్మగ్లర్లు దందా కొనసాగిస్తున్నారు. జిల్లాలోని కొన్ని ప్రైవేట్ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలల సమీపంలో గంజాయి పొడిని సిగరెట్లలో కలిపి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. మూతపడిన



పాఠశాలలు, శివారుప్రాంతాల్లో మద్యం సేవిస్తూ, సిగరెట్లలో గంజాయిని పీల్చుతూ విద్యార్థులు, కార్మికులు, టీనేజర్లు మత్తులో తేలిపోతున్నారు. గంజాయికి బానిసలై కొందరు డబ్బుల కోసం నేరాలకు పాల్పడుతుంటే, కొందరు అతివేగంగా వాహనాలు పడుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇటీవల నర్సంపేటలోని బెల్టుషాపు నిర్వాహకుడిని హత్యకు పాల్పడిన సమయంలో నిందితులు గంజాయిని సేవించినట్లు సమాచారం.

మూడేళ్లలో ఎన్నో ఘటనలు

- 2019 డిసెంబరులో నర్సంపేట శివారులో అక్రమంగా తరలిస్తున్న 40 కిలోల ఎండు గంజాయి పట్టివేత.
- 2020, ఫిబ్రవరి 26న నర్సంపేట శివారులో 44 కిలోల పట్టివేత
- 2021, సెప్టెంబరు 23న నల్లబెల్లి, ఖానాపురం మండలాల్లో 190 కిలోల స్వాధీనం. రవాణాకు ఉపయోగించిన కారు, ఆటోను స్వాధీనం.
- 2022, సెప్టెంబరు 9న బొలెరో వాహనంలో రూ.55.50లక్షల విలువైన 550 కిలోల పట్టివేత.
- 2024 ఆగస్టు 3న నర్సంపేట పట్టణంలోని మల్లంపల్లిరోడ్‌లో కారులో తరలిస్తున్న 250కిలోల ఎండు గంజాయిని స్వాధీనం.

256 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరు అరెస్టు, పరారీలో ముగ్గురు : సీపీ



వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఆగస్టు 3: వరంగల్ కమిషనరేట్ పరిధిలో భారీ స్థాయిలో గంజాయిని టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసులు శనివారం పట్టుకున్నారు. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని రూ.64లక్షల విలువైన 256 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం హనుమకొండలోని కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వివరాలు వెల్లడించారు. గంజాయి స్మగ్లింగ్ జరుగుతున్నట్లు పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసులు నర్సంపేట సమీపంలోని కమలాపూర్ క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. అటుగా కారులో వస్తున్న ఐదుగురు వ్యక్తులు పోలీసులను గమనించి తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు ఆయన అన్నారు. వారిని అడ్డగించిన పోలీసులు

మిగతా 8వ పేజీలో »

శాతవాహన, గోల్కొండ రైళ్ల బంద్

పద్మావతి, చార్మినార్, సింహపురి రైళ్ల దారి మళ్లింపు

గిర్మాజీపేట, ఆగస్టు 3: విజయవాడ రైల్వేస్టేషన్- విజయవాడ న్యూ పశ్చిమ క్యాబిన్ మధ్య జరుగుతున్న మూడో లైన్ పనుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు కొన్ని రైళ్లను రద్దు చేసింది. అలాగే శుక్రవారం నుంచి మరికొన్ని రైళ్లను వరంగల్ రాకుండా దారి మళ్లించింది. ప్రతీరోజు సికిందరాబాద్- వరంగల్- గుంటూరు మధ్య రాకపోకలు సాగిస్తున్న గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్- వరంగల్- విజయవాడ మధ్య రాకపోకలు సాగిస్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్, డోర్నకల్- విజయవాడ రైల్వేసేషన్ మధ్య రాకపోకలు సాగిస్తున్న డోర్నకల్- విజయవాడ పుష్‌పుల్ రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. రైళ్ల రద్దు, దారి మళ్లింపు దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులు తమ ప్రయాణాలను కొనసాగించి రైల్వేకు సహకరించాలని దక్షిణ మధ్య రైల్వే కోరింది.

పలు రైళ్ల దారిమళ్లింపు

సికింద్రాబాద్ నుంచి వరంగల్ మీదుగా తిరుపతి, గుడూరు, చెన్నై సెంట్రల్ మధ్య రాకపోకలు సాగిస్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్, పద్మావతి, సింహపూరి, చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను వరంగల్‌కు రాకుండా దారి మళ్లించారు. ప్రస్తుతం పంగిడిపెల్లి -కాజీపేట, వరంగల్-విజయవాడ-తెనాలి మీదుగా నడుస్తున్న ఈ రైళ్లను పంగిడిపల్లి- గుంటూరు- తెనాలి మీదుగా దారి మళ్లించారు. దీంతో కృష్ణా ఎక్స్‌ప్రెస్, పద్మావతి, సింహపురి, చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 10వ తేదీ వరకు వరంగల్‌కు రావని దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.

శ్రావణ మాసంలో అదనపు బస్సులు

రీజినల్ మేనేజర్ డి.విజయభాను

బాలసముద్రం, ఆగస్టు3: వచ్చే శ్రావణ మాసంలో ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బస్సులను నడపనున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగసు 5వ తేదీ నుంచి శ్రావణమాసం ప్రారంభమవుతున్నందున ఈ మాసంలో ఎక్కువ సంఖ్యలో శుభకార్యములు, వివాహముహూర్తములు ఉండడంతో ప్రయాణికులకోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అద్దె బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల ద్వారా రాజధాని, సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, ఏసీ, నాన్‌ఏసీ బస్సులు కోసం ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని అన్నారు. హనుమకొండ-9949857692, 9959226049, వరంగల్-1- 7382855793, 9959226047, వరంగల్-2-7382856145, 9959226048, జనగామ 7382852818, 9959226050, పరకాల 9705479088, 9959226051,భూపాలపల్లి 8978704061, 9959226707, నర్సంపేట 7382854074, 9959226052, మహబూబాబాద్ 9948214622, 9959226054, తొర్రూరు 7382855078, 9959226053 నెంబర్లలో అద్దె బస్సులు కోసం సంప్రదించాలని రీజినల్ మేనేజర్ తెలిపారు.



ట్రెండ్ మారినా.. ఫ్రెండ్ మారడు..

హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/లింగాలఘణపురం, ఆగస్టు 3: నిక్కరు నుంచి జీన్స్ ప్యాంట్‌కి ఎదిగినా.. కాన్వెంట్ నుంచి కాలేజీకి మారినా.. పెన్సిల్ నుంచి పెన్‌డ్రైవ్ దాకా వచ్చినా.. నోట్‌బుక్ నుంచి ఫేస్‌బుక్‌కు ఎదిగినా.. ట్రెండ్ మారినా ఫ్రెండ్ మాత్రం మారనే మారడు.. ల్యాండ్ లైన్ నుంచి స్మార్ట్‌ఫోన్‌కు వచ్చినా మాటల్లో చిలిపితనం మారదు.. మొట్టికాయ నుంచి గట్టిపంచ్‌లోకి మారినా నొప్పిలేని తియ్యందనమే ఒక అందమైన ఫ్రెండ్‌షిప్.. టెక్నాలజీ పెరిగినా.. ట్రెండ్ మారినా ఫ్రెండ్‌లోని స్పెల్లింగ్ మారదు.. స్నేహంలోని ఫీలింగ్ అంతకంటే మారదు. ఏ సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల నుంచి నేటి వరకు అదే 'సోపతి' కొనసాగు తోంది. కుల, మత బేధం అంతకన్నా ఎరుగనిది.. బంధుత్వం కన్నా గొప్పది స్నేహమొక్కటే. అనునిత్యం మనల్ని ప్రోత్సహిస్తూ ఆనంద డోలికల్లో ముంచేస్తూ దుఃఖాల ఎడబాటుతో సన్మార్గంలో నడిపించేవాడే నిజమైన స్నేహితుడు. ఫ్రెండ్ షిప్‌డే నాడు ఒకరినొకరు బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం, శుభాకాంక్షలు తెలుపుకోవడం కొన్నేళ్ల నుంచి ఆనవాయితీగా వస్తోంది. మార్కెట్‌లో పలు రకాల గ్రీటింగ్ కార్డులు, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు లభ్యమవుతున్నాయి. ఒకప్పుడు న్యూ ఇయర్, ఫ్రెండ్‌షిప్ వాలైన్‌టైన్‌డేకు గ్రీటింగ్స్‌కు స్వయంగా ఇచ్చిపుచ్చుకునేవారు. కానీ ఇప్పుడు కాలం మారింది.. ఆధునిక సొబగులు అరచేతిలో ప్రత్యక్షమవుతున్నాయి. సోషల్‌మీడియా దూరతీరాల్లో ఉన్న స్నేహాలను ఒక్కటి చేస్తోంది.

సోషల్ మీడియాతో చేరువవుతున్న స్నేహం

ఒకప్పుడు పాఠశాలను.. కళాశాలను విడిచిన స్నేహం మళ్లీ ఎప్పుడు ఎక్కడ కలుస్తుందో చెప్పలేకుండా ఉండేది. పండుగలకో పబ్బాలకో సొంతూరికి వస్తే తప్ప చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం కష్టసాధ్యంగా ఉండేది. వర్తమాన సాంకేతిక యుగం ఆధునిక ప్రపంచాన్ని అడుగడుగునా శాసిస్తోంది. అంతేకాదు.. ఎల్లలు దాటిన స్నేహాన్ని దగ్గర చేస్తుంది. సోషల్‌మీడియా పేరిట అల్లంత దూరాన ఉన్న బాల్యస్నేహితుడి ఆత్మీయ పరిమళాలు స్మార్ట్ ఫోన్‌ద్వారా దగ్గర అవుతున్నాయి.

ఆపదలో భరోసా.. ఆత్మీయతకు చిరునామా..

ఆపదలో ఉన్నవాడికి భరోసా.. ఆత్మీయతకు చిరునామా కలిగినవాడే అసలైన స్నేహితుడు.. అవసరం కోసం దగ్గరకు వచ్చి అవసరం తీరాక అడ్రస్ లేకుండా పోయేవాడు స్నేహితుడు కానే కాడు.. మిత్రుడికే కాదు.. మిత్రుడి కుటుంబ సభ్యులకైనా సరే ఆపద వస్తే తానున్నానంటూ ఆపద్బంధువులా వచ్చి ఆదుకునే స్నేహితులు ప్రతీ వ్యక్తికి కనీసం నలుగురైనా ఉంటారు. అలాంటి స్నేహితులు లేకపోవడం నిజంగా ఒక దుదృష్టకరమే.. ఆపదలో ఆదుకునే స్నేహితులే లేరనుకుంటే అది స్నేహానిది కాదు పొరపాటు.. స్నేహం చేస్తున్న వ్యక్తులది అనుకోవాలే తప్ప స్నేహాన్ని నిందించాల్సిన పనిలేదు. తాళికట్టిన భార్యకు సైతం చెప్పుకోలేని రహస్యాలను ఆత్మీయ స్నేహితులతో పంచుకొని బాధలను చెరిపేసుకుంటారు. అదీ స్నేహబంధానికి ఉన్న గొప్పతనం.

భిన్నతేదీల్లో స్నేహితుల దినోత్సవం

స్నేహితుల దినోత్సవానికి భిన్న తేదీలు ఉన్నాయి. హాల్‌మార్క్ కార్డ్ల వ్యవస్థాపకుడు జాయిస్ హాల్ 1919లో స్థాపించిన ఫ్రెండ్‌షిప్ డే వివిధ దేశాల్లో వేరు వేరు తేదీల్లో జరుపుకొంటున్నారు. 2011లో ఐక్యరాజ్య సమితి జూలై 30ని ఫ్రెండ్‌షిప్ డేగా గుర్తించింది. అయితే ప్రజలు, దేశాలు, సంస్కృతులు, వ్యక్తుల మధ్య స్నేహం శాంతి ప్రయత్నాలను ప్రేరేపిస్తుందన్న భావనతో యూఎన్ జనరల్ అసెంబ్లీ 2011లో అంతర్జాతీయ స్నేహ దినోత్సవాన్ని ప్రకటించింది. అయితే మెక్సికో, ఈక్వెడార్ లాంటి పలు దేశాలు ఫిబ్రవరి 14న స్నేహ దినోత్సవాన్ని జరుపుకుంటుండగా సింగపూర్‌లో ప్రజలు ఏప్రిల్ మూడో వారంలో స్నేహ దినోత్సవాన్ని పాటిస్తారు. ఇక మనదేశం సహా అనేక దేశాల్లో ఆగస్టు మొదటి ఆదివారం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వేర్వేరు తేదీల్లో స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నా స్నేహం గొప్పతనం, స్నేహబంధాలను మాత్రం అందరూ ఒకేలా గౌరవిస్తారు.

మిత్రుడి కూతురు చదువుకు స్నేహితుల తోడ్పాటు


స్నేహితుడి కుమార్తెకు స్కూల్‌ఫీజు ఇస్తున్న మిత్రులు (ఫైల్)

కేసముద్రం: కేసముద్రం మండలం వెంకటగిరికి చెందిన గాండ్లఅశోక్ 2018లో అనారోగ్యంతో మృతి చెందాడు. అంతకు ముందే అశోక్ భార్య మృతి చెందడంతో వారి కూతురు శివాని తల్లిదండ్రులు లేక నర్సంపేటలోని అమ్మమ్మ ఇంటి వద్ద ప్రైవేటు పాఠశాలలో చదువుతోంది. 1996-97లో అశోక్‌తో కలిసి పదోతరగతి చదివిన స్నేహితులు ఆయన కూతురు శివాని చదువు బాధ్యతను తీసుకున్నారు. అశోక్ మృతి చెందిన నాటి నుంచి ఐదేళ్లుగా ఏటా ఆమె విద్యకు అయ్యే పూర్తి ఖర్చును వారే భరిస్తున్నారు. ఈ ఏడాది కూడా రూ.45వేలను చెల్లించారు. ఐదేళ్లుగా స్నేహితుని కుమార్తె చదువుకోసం సహకరిస్తున్న ఈ మిత్రులను పలువురు అభినందిస్తున్నారు. అంతేకాకుండా 2018లో అశోక్ ఇద్దరు కూతుళ్లకు రూ.లక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

స్నేహితుడు అనారోగ్యం పాలైతే రూ.50వేలు


అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడికి రూ. 50వేలు అందజేస్తున్న బాల్యమిత్రులు

లింగాలఘణపురం మండలం నవాబుపేట జడ్పీహైస్కూల్ 2002-03 బ్యాచ్‌కు చెందిన పటేల్‌గూడెం యువకుడు వెంకటేశ్ అనారోగ్యం పాలుకావడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండగా బాల్య స్నేహితులు అంతా కలిసి రూ.50వేల ఆర్థిక సాయం అందించి తామున్నామంటూ భరోసాగా నిలిచారు. స్నేహబంధాలకు ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.. ఇంకా అనేకంగా స్నేహితులకు అండగా నిలుస్తూ స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అంటూ నిరూపిస్తున్నారు.

బాల్యస్నేహితులను మరిచిపోవద్దు


వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను



బాలసముద్రం: బాల్యస్నేహితులను ఎవరూ మరిచిపోవద్దు. మేము ఇప్పటికీ ఫోన్ చేసి చిన్ననాటి విషయాలను మాట్లాడుకుంటాం. స్నేహితులతో మాట్లాడితే మనసు ఎంతో తేలికగా ఉంటుంది. కుటుంబ సభ్యులు, బంధువులతో కంటే స్నేహితులతోనే అన్ని విషయాలు మాట్లాడుకుంటాం. ఉద్యోగాలలో స్థిరపడిన స్కూల్, కాలేజీ ఫ్రెండ్స్‌తో వారానికోసారి కలిసి సరదాగా మాట్లాడుకుంటాం. నేను రీజినల్ మేనేజర్‌గా, నాఫ్రెండ్ కండక్టర్‌గా ఒకే దగ్గర పని చేస్తున్నాం. మామధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు ఉండవు. బాల్య స్నేహితులతో కలిసి ఈమధ్యనే పూర్వవిద్యార్థుల సమావేశంలో కలిసి పాత రోజులు గుర్తు చేసుకున్నాం.

కల్మషం లేనిది స్నేహబంధం

ఎం.జితేందర్‌రెడ్డి, ఎస్‌బీ ఏసీపీ



వరంగల్ క్రైం : కల్మషం, లాభాపేక్ష లేనిది కేవలం స్నేహబంధం మాత్రమే. మంచి స్నేహితులున్నవారు ఉన్నతస్థితికి ఎదుగుతారు. మన కష్టసుఖాల్లో స్నేహితులు పాలుపంచుకుంటారు. కుటుంబసభ్యులకు చెప్పుకోలేని విషయాలను స్నేహితులతో పంచుకుంటాం. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా ఈర్ష్య పడకుండా ప్రోత్సహించేవారు స్నేహితులు. నా కష్ట సుఖాలను స్నేహితులతో, వారి కష్టసుఖాలు నాతో పంచుకుంటాం. సమయం దొరికినప్పుడల్లా మాట్లాడుతుంటాం. వీలున్నప్పుడు కలుసుకుంటాం.

మా స్నేహితులకు సేవాభావం ఎక్కువ

డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి, ప్రముఖ యూరాలజిస్టు



వరంగల్ మెడికల్: మా చిన్ననాటి స్నేహితులందరికీ సేవా భావం ఎక్కువ. ప్రజలకు ఏదో చేయాలనే తపన ఉండేది. పేదల కోసం ఆస్పత్రి పెట్టి సహాయం చేయాలనే కోరిక ఉంది. అందుకోసమే గ్లోబల్ ఫౌండేషన్ ఏర్పాటు చేశాం. ఈ ఫౌండేషన్ ద్వారా పేదలకు న్యాయం చేయాలని అనుకుంటున్నాం.


చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న కూరపాటి వెంకటనారాయణ, డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు

హనుమకొండ, వరంగల్ జిల్లాలను ఏకం చేయాలి

వరంగల్ మహా నగర అభివృద్ధికి మరో పోరాటం

తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

వడ్డేపల్లి, ఆగస్టు 3: హనుమకొండ, వరంగల్ జిల్లాలను ఏకం చేయాలని, వరంగల్ మహానగర అభివృద్ధికి మరో పోరాటం చేస్తామని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అభిప్రాయపడ్డారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్ భవన్‌లో వరంగల్ మహానగర పునర్నిర్మాణం, పరిపాలన సౌలభ్యం అభివృద్ధిపై ముప్పిడి సంపత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయనతో పాటు మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, తెలంగాణ ఉద్యమకారులు ముద్దసాని సహోదర్‌రెడ్డి, గుడిమళ్ల రవికుమార్, ఫోరం ఫర్ బెటర్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ మాట్లాడారు. పరిపాలన సౌలభ్యం పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చారిత్రక వరంగల్ జిల్లాను ఇష్టారాజ్యంగా ఆరు ముక్కలు చేసి ఆరు జిల్లాలను ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. ఫలితంగా వరంగల్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని విమర్శించారు. గత సీఎం కేసీఆర్ చారిత్రక నగరాన్ని ఆరు ముక్కలుగా విచ్ఛిన్నం చేసి ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ఉద్యమ నాయకత్వాన్ని రాజకీయ చైతన్యాన్ని దెబ్బతీశారని పేర్కొన్నారు. గత పాలకులు చేసిన ద్రోహాన్ని ప్రస్తుత పాలకులు సమీక్షించి వరంగల్, హనుమకొండ జిల్లాలను ఏకం చేసి అభివృద్ధి చేయాలని కోరారు.

ఉత్తర తెలంగాణలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కేంద్రమైన వరంగల్, ఉత్తర తెలంగాణకు విద్యాకేంద్రమైన హనుమకొండ, దక్షిణ భారత దేశానికి రైల్వే కేంద్రమైన త్రినగరి వరంగల్ మహా నగరాన్ని ఏకం చేయడం ద్వారానే అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. నగరమంటే పారిశ్రామిక ప్రాతినిధ్యం కలిగి ఉండాలని, పాలన సౌలభ్యం అంటే ప్రజలకు జీవన అవసరాలను మెరుగుపర్చేదిగా ఉండాలని పేర్కొన్నారు. అందుకు భిన్నంగా రాజకీయ, వ్యాపార వర్గాల మేలు కోసం జిల్లాలను ఏర్పాటు చేసి మహా నగరాన్ని విభజించారని దుయ్యబట్టారు. దక్షిణ భారత దేశాన్ని ఏలిన వరంగల్ కేంద్రాన్ని చారిత్రిక ఆనవాళ్లు లేకుండా చేయడమే కాకుండా అభివృద్ధిలో హనుమకొండ 30వ స్థానంలో ఉందని తెలిపారు. పాత జిల్లాల కేంద్రాలు అభివృద్ధి కేంద్రాలుగా ఉండేవని, కొత్త జిల్లాలతో ఆ అభివృద్ధి కుంటుపడిందని స్పష్టం చేశారు. మహానగరాలకు రావల్సిన జాతీయ స్థాయి నిధులు, సంస్థలు రాకపోవడం వల్ల వరంగల్ మహా నగర అభివృద్ధి వెనుకబడి పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఒక హైదరాబాద్ మహా నగరానికి మాత్రమే తరలిపోయి బతుకుతున్నారని అన్నారు. ఉత్తర తెలంగాణ కేంద్రమైన వరంగల్ మహా నగరాన్ని అభివృద్ధి చేస్తే రాష్ట్రంలోని సగభాగం ప్రజలకు ఉపాధి కేంద్రంగా మారుతుందని వారు స్పష్టం చేశారు. పోరాటాలకు కేంద్రమైన వరంగల్ మహానగరాన్ని కాపాడుకోవడానికి మరోపోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. రెండు జిల్లాల్లోని వివిధ రంగాలకు చెందిన వారిని ఏకం చేసి ప్రస్తుత ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వడమే కాకుండా రెండు జిల్లాల ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరిస్తామని తెలిపారు.

ఈ చర్చా గోష్ఠిలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, టీజేఎస్ నేత చిల్లా రాజేంద్రప్రసాద్, ప్రజా సంఘాల నేతలు కర్రా యాదవరెడ్డి, కోండ్ర నర్సింగరావు, సోమ రాంమూర్తి, కూనూరు రంజిత్‌గౌడ్,ఎండీ రాజ్‌మహ్మద్, ఐతం నగేష్, డాక్టర్ అశోక్‌రెడ్డి, రాచకొండ ప్రవీణ్‌కుమార్, నలిగంటిచంద్రమౌళి, దారం జనార్ధన్, డాక్టర్ గిరిజా రాణి, పల్లపు సమ్మయ్య, సారంపెల్లి వాసుదేవరెడ్డి, సోమిడి శ్రీనివాస్, బొట్ల చక్రపాణి, తాడిశెట్టి క్రాంతికుమార్, నున్న అప్పారావు, కేడెల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

వరంగల్ క్రైం, ఆగస్టు 3: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన పూజారి సందీప్ అనే యువకుడిపై కాకతీయ యూనివర్సిటీ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈనెల 1వ తేదీన పెగడపల్లి డబ్బాల సమీపంలోని సుందరయ్యనగర్‌కు చెందిన పూజారి సందీప్ అతడి పక్క గృహంలో నివాసం ఉండే బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో యువకుడు ఈ సంఘటనకు పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సందీప్‌ను అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రవిందర్ తెలిపారు.



ధర్మారెడ్డిని కలిసిన ఊకల్ సొసైటీ చైర్మన్

గీసుగొండ, ఆగస్టు 3: అవిశ్వాసం తీర్మానంతో ఊకల్ సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన మున్నంగి జనార్ధన్‌రెడ్డి శనివారం మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఆయన స్వగృహం హన్మకొండలో కలిశారు. జనార్ధన్‌రెడ్డిని ధర్మారెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, మాజీ సర్పంచ్ పుండ్రు జయపాల్‌రెడ్డి, అంకతి నాగేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు. మొగిలిచర్లలో ఇటీవల మృతిచెందిన నట్ల వీరలక్ష్మి, బెజ్జాల రమణయ్య, అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మేరుగు రవిందర్‌ను ధర్మారెడ్డి పరామర్శించారు. కార్పొరేటర్‌లు సుంకరి మనీషాశివకుమార్ పాల్గొన్నారు.



జనార్ధన్‌రెడ్డిని అభినందిస్తున్న ధర్మారెడ్డి

పాఠశాల భవనం పూర్తయ్యేనా..

- ఏడేళ్లుగా నిలిచిపోయిన పనులు
- శిథిలావస్థకు చేరిన ప్రస్తుత భవనం
- ఇటీవల వర్షాలకు పెచ్చులూడిన పైకప్పు..
- మూడు గదుల్లో ఐదు తరగతుల నిర్వహణ
- మధ్యకోటలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఇక్కట్లు

ఖిలావరంగల్, ఆగస్టు 3: పాఠశాల భవన నిర్మాణ పనులు ఏళ్లయినా పూర్తికాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖిలావరంగల్ మధ్యకోటలో(మిడిల్‌పోర్టు)ని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరగా, పాఠశాలలో మూడు గదులలో ఐదు తరగతులను నిర్వహిస్తున్నారు. 20ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. మధ్యకోటలోని బాలికల ఉన్నత పాఠశాలతోపాటు, అదే ఆవరణలో మిడిల్‌ఫోర్ట్‌లో ఒకటి నుంచి 5వ, తరగతి వరకు ప్రాథమిక పాఠశాల కొనసాగుతోంది. సుమారు 150 మంది విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో తరగతి గదులు, మూత్రశాలలు, ప్లే-గ్రౌండ్ తదితర వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల భవనం పెచ్చులు ఊడి కిందపడ్డాయని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. కేవలం 3 గదుల్లో ఐదు తరగతులను కొనసాగించడం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కష్టంగా మారింది. దీంతో 2017లో తెలంగాణ సర్వశిక్షా అభియాన్ వరంగల్‌అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో 3 అదనపు గదుల నిర్మాణం కోసం 2016-17లో సీఎంఏ నిధుల నుంచి రూ.45లక్షలతో 3+3 పద్ధతిలో భవన నిర్మాణానికి పూనుకున్నారు. వరంగల్ ఎమ్మెల్యే కొండా సురేఖ పనులను ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో 3+3 అదనపు గదులకు స్లాబ్‌లు వేశారు. లోపల గదులను పూర్తిచేయక పోవడంతో అసంపూర్తిగా ఉన్న గదులను ప్రస్తుతం మధ్యాహ్న భోజనం వంటలు చేసేవారు తమ సామన్లను పెట్టుకోవడానికి వాడుకుంటున్నారు. పై అంతస్తులో స్లాబ్‌వేసి వదిలివేశారు. 70శాతం పనులు పూర్తవగా, 30శాతం పనులు ఏడేళ్లుగా నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు అరకొర వసతులతో రేకుల షెడ్డులో కాలం వెళ్లదీస్తున్నారు.



ఇటీవల కురిసిన వర్షానికి ఊడిపడిన స్లాబ్ పెచ్చులు



ఏడేళ్లయినా పూర్తికాని పాఠశాల భవనం

కరువైన మౌలిక వసతులు

మధ్యకోటలోని ప్రాథమిక ప్రాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు లేకపోవడంతో స్థానికంగా ఉన్న మరుగుదొడ్లను వాడుకోవాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజనం వండే వంట కార్మికులకు గదులు లేక పోవడంతో వర్షాకాలంలో ఆవరణలోని భవనంలోనే వంట చేస్తున్నారు. ఒకే ఆవరణలో బాలికల ఉన్నత, ప్రాథమిక పాఠశాల నడవడంతో ఆటస్థలం లేక విద్యార్థులు ఆటవిడుపుకు దూరమవుతున్నారు.



మధ్యకోటలోని మిడిల్‌పోర్ట్ ప్రాథమిక పాఠశాల

పడమరకోటలో ఏర్పాటు చేయాలి

మధ్యకోట, తూర్పుకోటలలో ఒకటి నుంచి 5వ, తరగతి వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలు ఉండగా, పడమరకోటలో ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు విధి లేక ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తున్నారు. పడమరకోటలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. గతంలో పడమరకోటలోని ఎస్టీ కాలనీలో నిర్మించిన ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని మూసివేశారు.

కార్పొరేట్ పాఠశాలగా తీర్చిదిద్దుతా
దొనికెల శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు



మిడిల్‌ఫోర్ట్‌లోని ప్రాథమిక పాఠశాలను కార్పొరేట్ పాఠశాలగా తీర్చిదిద్దుతా. ఏడేళ్ల క్రితం 3+3 అదనపు గదులకు స్లాబ్‌ను వేశారు. ప్రస్తుతం పాఠశాలలో 5+1 ఉపాధ్యాయులతో పాఠశాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలి. ప్రభుత్వం చొరవ చూపితే.. విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

కోటలో నేత్రదానం

ఖిలావరంగల్, ఆగస్టు 3: మానవహక్కుల సంఘం, న్యూడెమోక్రసీ నాయకుడు బండి కోటేశ్వర్‌రావు తల్లి శనివారం మృతిచెందగా, ఆమె నేత్రాలను దానం చేశారు. పడమరకోటకు చెందిన బండి మల్లికాంబ(90) అనారోగ్యంతో బాధపడుతుండగా, చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు తెలిపారు. దీంతో ఆమె నేత్రాలను ఎంజీఎం ఐ-ఆస్పత్రి డాక్టర్ నరేందర్ సేకరించారు.

పోచమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక

శంభునిపేట, ఆగస్టు 3 : శంభునిపేటలోని పోచమ్మ ఆలయ అభివృద్ధి కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శంభుని పేటకు చెందిన కందికొండ మోహన్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా కందికొండ మల్లయ్య ఆధ్వర్యంలో శాలివాహన పూజారులు, ఆలయ కమిటీ సమావేశం ఆలయంలో నిర్వహించారు. కార్యదర్శులుగా కందికొండ మోహన్, జనార్ధన్, కోశాధికారిగా సముద్రాల రాజులు, ఉపాధ్యక్షులుగా కె.కందికొండ చక్రపాణి, సహాయ కార్యర్శిగా సముద్రాల ప్రకాశ్, సహాయ కోశాధికారిగా కందికొండ మురళీ, ఆర్గనైజర్స్‌గా కందికొండ ముఖేష్, భరత్‌చంద్ర, శరత్ చంద్ర, మహిళా విభాగం సభ్యులుగా కందికొండ లక్ష్మీ, మంజుల, భవానీ, మౌనిక, సముద్రాల కల్యాణి, శ్రీనిధిలు ఎన్నికయ్యారు. మహిళా పూజారులు కందికొండ వీరమ్మ, ఉపేంద్ర, భాగ్యలక్ష్మీ, సముద్రాల రాజమణిలు పాల్గొన్నారు.



మోహన్ జనార్ధన్

మరియపురాన్ని సందర్శించిన నిర్డ్ ప్రతినిధులు

గీసుగొండ, ఆగస్టు 3: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన మరియపురంను జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ(నిర్డ్) ప్రతినిధులు ఆశాలత, నిమ్మల శేఖర్‌లు శనివారం సందర్శించారు. పంచాయతీ ప్రణాళికలు, అభివృద్ధి ఇండెక్స్‌పై పరిశోధనలో భాగంగా గ్రామాన్ని సందర్శించినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో గ్రామస్థుల సహకారం, గ్రామ మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి గ్రామాభివృద్ధికి చేసిన కృషిని అడిగి తెలుసుకున్నారు. 5 సంవత్సరాల కాలంలో గ్రామం జాతీయస్థాయికి ఎదిగిన విధానం చేపట్టిన ప్రణాళికలు, అమలును వివరించారు. నిర్మల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వృద్ధులకు బాలిరెడ్డి స్వచ్ఛందంగా అందిస్తున్న సేవలను ప్రతినిధులు అభినందించారు.



స్థానిక మహిళలతో నిర్డ్ ప్రతినిధులు ఆశాలత, శేఖర్

పోలీసులకు సవాల్‌గా మారిన చైన్ స్నాచర్ల గుర్తింపు

మట్టెవాడ, ఆగస్టు 3: చైన్‌స్నాచర్ల గుర్తింపు పోలీసులకు సవాల్‌గా మారింది. నగరంలో రెండు చైన్‌స్నాచింగ్ ఘటనలు జరిగి ఐదు రోజులు గడిచినా స్నాచర్లను గుర్తించడంలో కష్టంగామారింది. నగరంలోని సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నా ఎలాంటి ఆధారాలు లభించడం లేదు. నగర శివారు ప్రాంతాల్లో కూడా సీసీ పుటేజీలు, ప్రధాన జంక్షన్లలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నా ఫలితం లేకుండాపోతోంది. ఎటు వైపు నుంచి వచ్చారు.. ఎటువైపు వెళ్లారనే దానిపై ఎలాంటి ఆధారాలు దొరకడం లేదు. స్థానికంగా బైక్‌కు దొంగిలించి చైన్ స్నాచర్లకు పాల్పడ్డరా.. రెక్కీ చేసి చైన్ స్నాచర్లకు పాల్పడ్డరా అనే కోణంలో విచారిస్తున్నారు. రాత్రిసమయంలో చైన్ స్నాచింగ్ చేయడం, చీకటి, సీసీ కెమెరాలు లేనిప్రాంతాలను చైన్ స్నాచర్లు ఎంచుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్, కాశిబుగ్గ జంక్షన్‌లో సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పనిచేయడం లేదు. స్నాచర్లు ఎటువైపు నుంచి వచ్చారు. ఎటు వెళ్లారనే ఆధారాలు లభించలేదు. కాగా, ఇది స్థానిక గ్యాంగా, గంజాయి గ్యాంగా లేక యూపీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లకు చెందిన స్టార్ గ్యాంగా, భవరియా గ్యాంగ్, ఢిల్లీ, బిహార్, హర్యానా గ్యాంగ్‌ల పనా అనే కోణంలో పోలీసులు విచారణ సాగిస్తున్నారు.

కష్టజీవుల రాజ్యం రావాలి: ఎంసీపీఐ

గీసుగొండ, ఆగస్టు 3: దేశ సహజ సంపద అందరికి సమానంగా పంచబడి, కష్టజీవుల రాజ్యం రావాలన్నదే కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధాంతమని ఎంసీపీఐ జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. పార్టీ నేత కుమారస్వామి ఇటీవల గుండుపోటుతో మృతిచెందగా శనివారం గీసుగొండలో ఆయన సంతాపసభను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం, పేదప్రజలకు కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమయోధుడు కందికొండ కుమారస్వామి అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో జాతీయ నాయకులు రాజ్‌పాశ్వాన్, గాదెగోని రవి, గోనె కుమారస్వామి, వల్లెపు ఉపేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు పెద్దారపు రమేష్, హంసారెడ్డి, ప్రతాప్, బాబురావు, వెంకన్న, రాగసుధ, కనకం సంధ్య, ఇస్మాయిల్, మల్లికార్జున్ పాల్గొన్నారు.



కుమారస్వామి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అశోక్

'ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం'

కరీమాబాద్, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన చరిత్రాక తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు అన్నారు. 39వ డివిజన్‌లోని దళితకాలనీలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణపై చేసిన పోరాటాలు ఫలించాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు మాచర్ల రవీందర్, తోటకూరి వేణు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాదాసు రాజు

256 కిలోల గంజాయి పట్టివేత

(5వ పేజీ తరువాయి)

పట్టుకునే ప్రయత్నం చేయగా భూపాలపల్లికి చెందిన బానోత్ బాబు కుమారస్వామి, నస్కురి కుమారస్వామి పట్టుబడగా మహబూబాబాద్‌కు చెందిన జలేందర్, భూపాలపల్లికి చెందిన అంగోతు రాజేందర్, తూర్పుగోదావరికి చెందిన ముకుంద్ పరారైనట్లు కమిషనర్ తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి గంజాయితో పాటు కారు, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టుబడిన ఇద్దరు నిందితులు డ్రైవర్ వృత్తి చేస్తూ పరారైన ముగ్గురితో కలిసి ఆంధ్రాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేవారని ఆయన తెలిపారు. ఇదే క్రమంలో 256 కిలోల గంజాయి ఆంధ్రాలో గంజాయి కొనుగోలు చేసి 128 ప్యాకెట్లు చేసి కారులో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో డీసీపీ రవిందర్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, ఎస్‌బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, సీఐలు రవికుమార్, సార్ల రాజు, రమణమూర్తి, ఎస్‌ఐలు శరత్‌కుమార్, భాను ప్రకాశ్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు. కాగా, గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్, నర్సంపేట ఏసీపీలు, సిబ్బందిని సీపీ అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే

సంగెం, ఆగస్టు 3: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం సంగెం మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయాలకతీతంగా ఆదుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా, పేదలకు అండగా ఉండేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌లకు నిధులు కేటాయించారన్నారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, గత ప్రభుత్వం తప్పుడు ఆలోచనతో రైతుల ప్రయోజనాలను పక్కకు పెట్టిందని ఆరోపించారు. భూములు కోల్పోతున్న రైతులందరికీ న్యాయం జరిగేలా సీఎం అధికారులకు తగిన ఆదేశాలను ఇవ్వడం జరిగిందన్నారు. తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో కాసర్ల రవీందర్, మాజీ ఎంపీపీ కళావతి, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చోల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆగపాటి రాజు నాయకులు కందకట్ల నరహరి పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే

గీసుగొండ: సమాజంలో అన్ని వర్గాలతోపాటు నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. 15, 16వ డివిజన్‌లకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు 49 మందికి 15.77లక్షల విలువైన చెక్కులను, లబ్ధిదారులకు కొనాయిమాకుల రైతువేదికలో శనివారం అందచేశారు. మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దిన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య, అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, కొండేటి కొమురారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు దూపాకి సంతోష్, జావీద్, దౌడు ప్రవీణ్, జానీ పాష, కూసం రమేష్, దూల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సంగెంలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి

సంగెం, ఆగస్టు 3 : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ రైతు శనివారం మృతిచెందిన ఘటన మండలంలోని నల్లబెల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన కొట్టం దామోదర్(35) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతుండగా, ఇటీవల తీవ్ర ఎక్కువ కావడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. దీంతో గత నెల 30న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అనంతరం కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దామోదర్‌కి భార్య అనిత, కూతురు ఉంది. కాగా, మృతుడి తల్లి రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

కరీమాబాద్, ఆగస్టు 3: వివాహిత అదృశ్యమైనట్టు కుటుంబ సభ్యులు పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య కథనం ప్రకారం పూరెల్ల హరిత (24), తన భర్త సూర్యచంద్, ఇద్దరు పిల్లలతో పెద్ద పెండ్యాలలో ఉంటోంది. ఇటీవల హరిత తన కూతురు, కుమారుడితో కలిసి అదృశ్యమైంది. ఈ విషయమై కుటుంబ సభ్యులు ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన పూరెల్ల రాకేష్ అనే వ్యక్తితో పశ్చిమ బెంగాల్‌లో దొరికింది. గతనెల 24న పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి హరిత సోదరుడైన తోట నాగరాజుకు హరితను అప్పగించారు. నాగరాజు తన సోదరిని కరీమాబాద్ ప్రాంతంలోని కోయవాడలో తన నివాసానికి తీసుకొచ్చాడు. శుక్రవారం ఏడాదిన్నర బాబుతో హరిత మరోసారి అదృశ్యం అయింది. ఎన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో హరిత సోదరుడు నాగరాజు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన సోదరిని రాకేష్ అనే వ్యక్తి తీసుకెళ్లాడని అనుమానం వ్యక్తం చేస్తూ, అతనిపై చర్యలు తీసుకొని తన సోదరిని అప్పగించాలని ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవం

పోచమ్మమైదాన్, ఆగస్టు 3: పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేందుకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని మూడో డివిజన్ కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్ అన్నారు. పైడిపెల్లిలో శనివారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జక్కుల లావణ్య ఆధ్వర్యంలో కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడారు. వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యశోద, రాధిక, బేబి నిర్మల పాల్గొన్నారు.

ఖాతా లేని బ్యాంకులో రుణమాఫీ

అధికారుల నిర్వాకం.. అవాక్కయిన రైతులు

నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నల్లబెల్లి, ఆగస్టు 3: అసలు ఖాతానే లేని డీసీసీబీ బ్యాంకులో రుణమాఫీ పడడంతో రైతులు అవాక్కయ్యారు. ఈ మేరకు స్థానిక వ్యవసాయ సహకార సంఘం వద్ద బాధిత రైతులు శనివారం ఆందోళన చేశారు. అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు నాన్నబోయిన రవి, భూక్య రవి తెలిపిన కథనం ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మొదటి విడత రుణమాఫీలో తమకు రుణమాఫీ జరగకపోవడంతో బ్యాంకుల వద్దకు వెళ్లి చూశామన్నారు. అయితే అక్కడి అధికారులు వ్యవసాయ శాఖ కార్యాలయం వెళ్లాలని సూచించారు. దీంతో వ్యవసాయ శాఖ కార్యాలయానికి వారు వెళ్లగా ఏఈవో పరిశీలించారు. అక్కడ డీసీసీబీ బ్యాంకులో నాన్నబోయిన రవికి రూ.2లక్షలు, భూక్య రవికి రూ.1.50 లక్షల పంట రుణం పొందినట్లు ఉంది. దీంతో ఒక్కసారిగా షాక్ అయిన రైతులు.. డీసీసీబీ బ్యాంకు వెళ్లి సంప్రదించగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అడగాలని తెలిపారు. రైతులు పీఏసీఎస్‌కు వెళ్లి అడగగా.. ఆధార్‌కార్డు నెంబర్లు తప్పుగా నమోదయ్యాయని, సరిచేస్తామని సీఈవో మొగిలి చెప్పారు. తాము డీసీసీబీలో రుణమే తీసుకోలేదని, అధికారుల తప్పిదంతో తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయకుంటే ఆందోళన చేపడుతామన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట తమ గోడు వెల్లబోసుకుంటున్న రైతులు

పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన పెంచాలి

సంగెం, ఆగస్టు 3: గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనంపై ప్రజలకు అవగాహన పెంచేందుకు గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలని అధికారులను మండల ప్రత్యేకాధికారి వేదవతి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో స్వచ్ఛదనం -పచ్చదనంపై అవగాహన సదస్సు జరిగింది. ఈనెల 5నుంచి 9 వరకు పచ్చదనం, పరిశుభ్రతపై కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాసర్ల రవీందర్, ఎంపీవో కొమురయ్య పంచాయతీరాజ్ ఏఈ రాజు పాల్గొన్నారు.

- కరీమాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మరవి అన్నారు. శనివారం ఎస్ఆర్ఆర్‌తోటలోని ఆమె నివాసంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆర్‌పీలు, ఆశావర్కర్లు, శానిటేషన్ సిబ్బందితో, డివిజన్ కమిటీలు, నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ముజమ్మిల్, వార్డ్ ఆఫీసర్ రాజేశ్వరి, హెల్త్ ఆఫీసర్ మోహన్‌రావు, జవాన్ ఓరుగంటి జీవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల అందజేత

పోచమ్మమైదాన్, ఆగస్టు 3: దేశాయిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి అయిత ఉషాభాస్కర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అనుమండ్ల అనిల్‌చందర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కుమ్మరి బాబురాజ్, ఉపాధ్యక్షుడు గండి ఆనందం, రోకుల లక్ష్మి, జగన్, దూలం సందీప్, కుమ్మరి నిఖిల్, నయిం, పవన్‌కుమార్, భరత్, సిద్ధు, డాక్టర్ పాలడుగుల సురేందర్, పాఠశాల పీఈటీ కన్నెబోయిన నిశాంత్‌యాదవ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు అందిస్తున్న అనిల్‌చందర్‌రావు

కూరగాయల మార్కెట్లో వైద్య శిబిరం

వరంగల్ వ్యవసాయం, అగస్టు 3: వరంగల్ లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్లో మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, వ్యాపారులు, వినియోగదారులు, రైతులకు డాక్టర్ మల్లేశం పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రేడ్2 కార్యదర్శి రామోజు రాము, ఏఎస్ రాజేందర్, పర్యవేక్షకులు మురళీ, ఎండి. సలీం, చక్రబహదూర్ పాల్గొన్నారు.

'ఆక్స్‌ఫర్డ్'లో ఘనంగా బోనాలు



బోనాల జాతరను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో కరస్పాండెంట్ రాంమ్మూర్తి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 3: విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ దండాపంతుల రాంమ్మూర్తి అన్నారు. శనివారం మట్టెవాడలోని పాఠశాలలో బోనాల జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు బోనాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బోనం భాగ్యానికి చిహ్నమని, ప్రకృతిని శక్తిరూపంగా కొలుస్తూ నిర్వహించే పండుగనే బోనాల పండుగని రాంమ్మూర్తి విద్యార్థులు బోనాల జాతరను ప్రదర్శించగా పదవ తరగతి విద్యార్థి జి.సూర్యతేజ పోతరాజు వేషంలో ఆకట్టుకుంది. పాఠశాల ప్రెసిడెంట్ రాధారాణి, ఉపాధ్యాయులు ప్రసాద్, అభినయ్, సంధ్య, మౌనిక, సంధ్యారాణి, అన్వరీ, అరేషా, సౌజన్య, జ్యోతి, కావ్య అఫ్షాన్ పాల్గొన్నారు.

మొగిలిచెర్ల బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ సస్పెన్షన్

గిర్మాజిపేట, ఆగస్టు 3 : విధి నిర్వహణలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన మొగిలిచెర్ల బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ సున్నం శ్వేతను సస్పెండ్ చేసినట్లు వరంగల్ సౌత్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.వరప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపాజిట్ల సేకరణ తదితర నిధులలో శ్వేత అక్రమాలకు పాల్పడినట్లుగా వచ్చిన ఫిర్యాదుల మేరకు శ్వేతను సస్పెండ్ చేసి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మొగిలిచెర్ల బ్రాంచ్ పోస్టాఫీసు పరిధిలోని మొగిలిచెర్ల, రెడ్డిపాలెం, గోపాల్ రెడ్డి నగర్ ప్రజలు తపాలా శాఖకు సంబంధించిన డిపాజిట్లు తదితర ఎలాంటి డబ్బులు శ్వేతకు చెల్లించరాదని సూచించారు. ఆయా ప్రాంతాల ప్రజలు తపాలా సేవకు సంబంధించిన డిపాజిట్లు తదితర కార్యకలాపాలను దేశాయిపేట సబ్ పోస్టాఫీసులో వినియోగించుకోవాలని కోరారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్యాయత్నం

కాపాడిన వాజేడు ఎస్సై హరీష్

వాజేడు, ఆగస్టు 3: బీటెక్ పూర్తి చేసిన ఓ యువకుడు ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. ఈ సంఘటన వాజేడు మండలంలోని బొగ్గుల వాగు సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై హరీష్ తెలిపిన ప్రకారం... వరంగల్ జిల్లా కేంద్రం మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామన్నపేటకు చెందిన వేముల సాయికృష్ణ అనే యువకుడు ఐదేళ్ల క్రితం బీటెక్ పూర్తి చేశాడు. ఇటీవల ఏఈఈ ఉద్యోగ పరీక్ష రాయగా ఫలితాలు శుక్రవారం విడుదల అయ్యాయి. ఆ ఫలితాల్లో తన పేరు రాలేదని సాయికృష్ణ తెలుసుకున్నాడు. ఈ క్రమంలోనే తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశ్యంతో మనస్తాపం చెంది బైక్‌పై ములుగు జిల్లా వాజేడు మండలంలోని మురుమూరు-బిజినేపల్లి మధ్యలో ఉన్న బొగ్గుల వాగు వద్దకు శుక్రవారం రాత్రి చేరుకున్నాడు. వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి రాత్రి 10.30 గంటల సమయంలో తన మిత్రుడికి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. హైరాన పడ్డ మిత్రుడు తనకు తెలిసిన వారితో వాజేడు ఎస్సైకు సమాచారం ఇవ్వగా లొకేషన్ ఆధారంగా సాయికృష్ణ ఉన్న ప్రదేశాన్ని గుర్తించిన ఎస్సై హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న సాయికృష్ణను 108 వాహనంలో ఏటూరునాగారం తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం వరంగల్‌కు తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, సాయికృష్ణ తండ్రి శ్రీనివాస్ హనుమకొండలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.

అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శంభునిపేట, ఆగస్టు 3: అసంఘటిత కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మేకల మొగిలి అన్నారు. అసంఘటిత కార్మికుల సంఘం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శనివారం శంభునిపేట జంక్షన్‌లో కార్మికులతో కలిసి మొగిలి ఆవిష్కరించారు. మొగిలి మాట్లాడుతూ జక్కలొద్దిలోని ప్రభుత్వ భూమిలో గుడిసె వేసుకొని కార్మికుల హక్కుల పోరాటానికై ఆదివారం నగరంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టాక్స్ సదస్సుకు అసంఘటిత రంగం కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షులు గాలి భిక్షపతి, ఎస్.యాకయ్య, కుమారస్వామి, సుధాకర్, రాజు, నవీన్ కుమార్, వేణు, వెంకటేష్, జి.సురేష్, మారయ్య పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై బల్దియా ఉక్కుపాదం

హైకోర్టు ఆదేశాల మేరకు కూల్చివేతలు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 3: గ్రేటర్ వరంగల్ నగరంలోని చెరువులను ఆనుకుని నిర్మించిన అక్రమ కట్టడాలపై బల్దియా అధికారులు కొరడా ఝుళిపించారు. ఎఫ్‌టీఎల్ పరిధిని ఆక్రమించిన వారిపై ఉక్కుపాదం మోపారు. చెరువులు, కుంటలను ఆనుకుని ఎఫ్‌టీఎఫ్‌ను ఆక్రమించి కట్టడాలు జరిపిన ఏసీసీ షెడ్లు, ప్రహరీలను గుర్తించి హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున కూల్చివేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య అక్రమ కట్టడాలను తొలగించారు. వరంగల్‌లోని చిన్న వడ్డెపల్లి చెరువు, బందం చెరువు, కోట చెరువు సమీపంలోని ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) అక్రమ నిర్మాణాలను గుర్తించి 12 ఏసీసీ షెడ్లు, 7 కాంపౌండ్స్ వాల్స్‌ను మొత్తంగా 19 అక్రమ కట్టడాలను తొలగించినట్టు బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు. బల్దియా సిటీ ప్లానర్ ఎం.శైలజ సారథ్యంలో కూల్చివేతలు జరిపినట్టు తెలిపారు. కూల్చివేతల కార్యక్రమంలో వరంగల్ బల్దియా అధికారులతో పాటు పోలీసులు పాల్గొన్నారు.



చిన్నవడ్డెపల్లి చెరువు ప్రాంతంలో కూల్చుతున్న అధికారులు



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 4 ఆగస్టు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

నాణ్యమైన వైద్యం అందించాలి



ఆస్పత్రి ఆవరణను పరిశీలిస్తున్న డీసీహెచ్

వర్ధన్నపేట, ఆగస్టు 3 : పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అందుకు వైద్యులు అంకితభావంతో పనిచేయాలని డీసీహెచ్ గోపాల్ అన్నారు. శనివారం వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేయడంతోపాటు ఆసుపత్రిలోని ఇన్, అవుట్ పేషెంట్ విభాగాలు, ఆవరణను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న భవనంపై నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన పై అంతస్తును త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలని కోరారు. ఆసుపత్రిలో, ఆవరణలో అపరిశుభ్రంగా ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు మరోసారి ఈ విధంగా ఉంటే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

అస్తవ్యస్తంగా ఎత్తిపోతల నిర్వహణ

పాకాల వాగులో వృథాగా పోతున్న సాగు నీరు

నీరులేక ముదురుతున్న వరి నారులు

పట్టించుకోని అధికారులు, పాలకులు

చెన్నారావుపేట, ఆగస్టు 3 : మండల కేంద్రంలో పాకాల వాగుపై నిర్మించిన ఇందిరా ప్రియదర్శిని ఎత్తిపోతల పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారినా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోపాకుల చెరువు వర్షాలతో నిండని పక్షంలో పుట్టుల పంపు కాలువ, మిట్ట కాలువ, చివరి ఆయకట్టులో ఉన్న సుమారు 200 ఎకరాలకు సాగు నీరందించేందుకు పాకాల వాగుపై రూ.2 కోట్ల20లక్షలతో ఎత్తి పోతల పథకాన్ని 2006 సంవత్సంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులోకి కనీసం 3 ఫీట్ల సాగునీరు రాలేదు. ఎత్తి పోతల పథకం కమిటీ కూడా లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.



చెన్నారావుపేటలో పాకాల వాగుపై ఉన్న ఎత్తిపోతల పథకం



కోపాకుల చెరువు కాలువ



కోపాకుల చెరువు కింద ముదురుతున్న వరినారు

సాగు నీరు లేక ముదురుతున్న వరి నారు

మండలంలోనే అతి పెద్ద చెరువైన కోపాకుల చెరువులో ఈ ఖరీఫ్ సీజన్ లో సాగునీరులేక వెలవెల పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో చెరువు కింద సుమారు 700ఎకరాలకు సాగు నీరందిస్తారు. అంతే కాకుండా పాకాల వాగుపై నిర్మాణం చేపట్టిన ఎత్తిపోతల పథకంతో కలిసి చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తారు. ప్రస్తుతం చెరువులో నీరులేదు. పాకాల వాగుపై నిర్మాణం చేసిన ఎత్తి పోతల పథకం పనిచేయడంలేదు.దీంతో రైతులు వరినాట్లు మొదలు పెట్టలేదు. రైతులు నెలల క్రితం పోసిన వరి నారులు ముదిరి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో పాకాల వాగులో సాగు నీరు వృథాగా పోతుందని రైతులు ఆరోపిస్తు న్నారు.

ఎత్తిపోతలకు మరమ్మతులు చేపట్టాలి

హంస విజయరామరాజు, మాజీ సర్పంచ్, చెన్నారావుపేట



పాకాల వాగుపై ఉన్న ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేపట్టాలి. ప్రస్తుతం చెరువులో సాగు నీరు లేదు. చివరి కింది ఆయకట్టుకు చుక్క నీరురాని పరిస్థితి. సాగు నీరు కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు నాట్లు వేసిన రైతులు నానాపాట్లు పడుతుండగా. వరి నాట్లు వేయని రైతుల వరి నారులు ముదురుతున్నాయి, వాగులో సాగు నీరు వృథాగా పోతుంది. ఎమ్మెల్యే మాధవరెడ్డి. అధికారులు చొరవ తీసుకొని చెరువులో సాగు నీరు పోసేటట్టు ప్రతిపాదనలు చేసి పైపు లైన్‌ను పొడిగించాలి.

ఎత్తి పోతల పనిచేస్తే వరి నాట్లు పూర్తయ్యేవి

లక్కడి కోమల్‌రెడ్డి, రైతు, చెన్నారావుపేట



ఎత్తి పోతల పథకం పనిచేస్తే చెరువు కింద సగం వరకు వరినాట్లు పూర్తయ్యేవి, ఎత్తిపోతల పథకం రైతులకు ఏనాడు ఉపయోగపడని పరిస్థితిలోనే ఉంది. కాలువలు చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారడంతో చివరి ఆయకట్టుకు సాగునీరందడం లేదు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడున్నాం. వరి నార్లు ముదిరిపోతున్నాయి. ఎత్తిపోతల పథకం ద్వారానైనా సాగు నీరందించాడానికి అధికారులు చర్యలు చేపట్టాలి.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

• ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



కాట్రపెల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

రాయపర్తి, ఆగస్టు 3 : పాలకుర్తి నియోజకవర్గఅభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గట్టికల్లు, రాయపర్తి, సన్నూరు, కాట్రపెల్లి గ్రామాల్లో రూ.30 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి గ్రామాల అభివృద్ధిపై దృష్టిసారిస్తున్నాడని గుర్తుచేశారు. అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని తెలిపారు. గాంధీ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ గ్రామాలను అభివృద్ధి చేసేందుకు సిద్ధంగాఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షు డు జాటోతు హమ్యానాయక్, మండలపార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, పాలకుర్తి ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, మచ్చ రమేష్, తండాల యాకయ్య, రాపాక సోమన్న, మేరుగు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాలేని బ్యాంకులో రుణమాఫీ

• అధికారుల నిర్వాకం.. అవాక్కయిన రైతులు

• పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



పీఏసీఎస్ సిబ్బందితో ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

నల్లబెల్లి, ఆగస్టు 3 : అసలు ఖాతానేలేని డీసీసీబీ బ్యాంకులో రుణమాఫీ పడడంతో రైతులు అవాక్కయ్యారు. ఈ మేరకు స్థానిక వ్యవసాయ సహకార సంఘం వద్ద బాధిత రైతులు శనివారం ఆందోళన చేశారు. అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. బాధిత రైతులు నాన్నబోయిన రవి, భూక్య రవి తెలిపిన కథనం ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మొదటి విడత రుణమాఫీలో తమకు రుణ మాఫీ జరగకపోవడంతో బ్యాంకుల వద్దకు వెళ్లి చూశామన్నారు. అయితే అక్కడి అధికారులు వ్యవసాయ శాఖ కార్యాలయం వెళ్లాలని సూచించారు. దీంతో వ్యవసాయ శాఖ కార్యాలయానికి వారు వెళగా ఏఈవో పరిశీలించారు. అక్కడ డీసీసీబీ బ్యాంకులో నాన్నబోయిన రవికి రూ.2 లక్షలు, భూక్య రవికి రూ.1.50 లక్షల పంట రుణం పొందినట్లు ఉంది. దీంతో ఒక్కసారిగా షాక్ అయిన రైతులు.. డీసీసీబీ బ్యాంకు వెళ్లి సంప్రదించగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అడగాలని తెలిపారు. రైతులు పీఏసీఎస్‌కు వెళ్లి అడగగా.. ఆధార్‌కార్డు నెంబర్లు తప్పుగా నమోదయ్యాయని, సరిచేస్తామని సీఈవో మొగిలి చెప్పారు. తాము డీసీసీబీలో రుణమే తీసుకోలేదని, అధికారుల తప్పిదంతో తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. తమకు న్యాయంచేయకుంటే ఆందోళనచేపడుతామన్నారు.

మెడికల్ కళాశాల తరగతుల ప్రారంభంపై హర్షం



సంబరాలు జరుపుకుంటున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

నర్సంపేట టౌన్, ఆగస్టు 3: నర్సంపేట పట్టణంలోని నూతన మెడికల్ కళాశాల తరగతులు త్వరలో ప్రారంభం కానున్నందున హర్షం వ్యక్తంచేస్తూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని వరంగల్ క్రాస్‌రోడ్డు వద్ద బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. బీఆర్‌ఎస్‌వీ డివిజన్ నాయకుడు సదిరం వినయ్ మాట్లాడుతూ మెడికల్ కళాశాల నర్సంపేటకు మంజూరు కావడానికి కృషి చేసిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు అజయ్, నరేష్, దేవోజు హేమంత్, బాలకృష్ణ, సిద్దు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సంపేట, ఆగస్టు 3: అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ బత్తిని రాజేందర్ ఆధ్వర్యలంలో కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్, పాలాయి రవికుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకూబ్‌రెడ్డి, మేరుగు సాంబయ్య, పట్టణ అధికార ప్రతినిధి గుంటి వీర ప్రకాశ్ పాల్గొన్నారు.

• నర్సంపేట టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలో మహిళా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో భాగ్యశ్రీ, రమ్య, ప్రవళిక, శిరీష, రజిత, వెన్నెల, అనూష, రూప, మధులత పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నెక్కొండ, ఆగస్టు 3 : నెక్కొండ సొసైటీ మాజీ చైర్మన్ రావుల మల్లారెడ్డి సతీమణి రావుల లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఆయన వెంట నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, జిల్లా యూత్ అధ్యక్షుడు బండి శివకుమార్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, చల్లా శ్రీపాల్‌రెడ్డి, రావుల మైపాల్‌రెడ్డి, లైసెట్టి వినయ్, రావుల తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

కాసం కృష్ణమూర్తి ఆశయ సాధనకు పాటుపడాలి

నర్సంపేట, ఆగస్టు 3 : నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కాసం కృష్ణమూర్తి ఆశయ సాధనకోసం పాటుపడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుమారస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో శనివారం కృష్ణమూర్తి 18వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నమీండ్ల స్వామి, శారద, రుద్రారపు లక్ష్మి, మాదాసి శ్రీను. గట్ల నర్సింహరావు పాల్గొన్నారు.

వృద్ధురాలి బాధ్యతను ఇరు కుటుంబాలు తీసుకోవాలి

అంగన్‌వాడీ టీచర్‌కు మెమోజారీ

ఆర్డీవో ఆదేశాల మేరకు విచారణ



అధికారుల విచారణకు హాజరైన కొమురమ్మ కుటుంబ సభ్యులు

నెక్కొండ, ఆగస్టు 3 : నెక్కొండ మండలం చంద్రుగొండకు చెందిన వృద్ధురాలు వడ్డె కొమురమ్మ బాధ్యతలను ఆమె ఇద్దరు కుమారుల కుటుంబ సభ్యులు తీసుకోవాలంటూ నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి ఆదేశాలను జారీ చేశారు. ఈ మేరకు శనివారం నెక్కొండ ఆర్ఐ నరేందర్ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన మానవత్వం మరచిన అంగన్‌వాడీ టీచర్ కథనానికి ఆర్డీవో, ఐసీడీఎస్, సఖీ అధికారులు స్పందించారు. వేరు వేరుగా విచారణ నిర్వహించిన అధికారులు కొమురమ్మకు తక్షణమే వైద్య సేవలను అందించాలంటూ కుటుంబ సభ్యులను ఆదేశించారు. అలాగే ఇంత కాలం పాత పెంకుటింట్లో ఒంటరిగా ఉన్న కొమురమ్మను రెండో కుమారుడు దయాకర్-పద్మ (అంగన్‌వాడీ టీచర్) దంపతుల ఇంటికి తరలించారు. నెలలో 15 రోజులు పెద్ద కుమారుడు పరమేశ్వర్-విజయ, 15 రోజులు చిన్న కుమారుడు దయాకర్-పద్మలు చూసుకోవాలంటూ గ్రామస్థుల సమక్ష్యంలో ఆదేశించారు. బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్న అంగన్‌వాడీ టిచర్ పద్మ కుటుంబ సభ్యుల విషయంలో బాధ్యతలను విస్మరించినందుకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత మెమో జారీ చేశారు.

మహిళలు వ్యాపార, ఉత్పత్తి రంగాల్లో రాణించాలి



దుగ్గొండిలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాములు

దుగ్గొండి, ఆగస్టు 3 : మహిళలు వ్యాపార, ఉత్పత్తి రంగాల్లో రాణించాలని దానికి మహిళ రైతులు ఐక్యం కావాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త రాములు సూచించారు. మండల కేంద్రంలోని మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ సమావేశం శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా శాస్త్రవేత్త రాములు మాట్లాడారు. మహిళలు అభివృద్ధి పథంలో పోవాలంటే వ్యాపారంలో విత్తనాలు అమ్మడం, కొనడం, కోళ్ల ఫారం, గొర్రెల ఫారం, పసుపు, కారంపొడి తదితర వ్యాపారాల్లో ముందుకు పోవాలన్నారు. సభ్యుల లావాదేవీలు బ్యాంక్‌ల ద్వారా నడపాలని సూచించారు. బ్యాంక్‌లు ఆర్థికంగా రుణాలు అందిస్తాయన్నారు. సంస్థ ఎండీ పద్మ మాట్లాడుతూ రూ:5లక్షలతో వ్యాపారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధి రమాదేవి, డైరెక్టర్లు నాగుర్ల సునీత, గుళ్లపెల్లి లలిత, అడప స్వరూప, కొలిపాక రేణుక, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తులు దోహదపడతాయి

నెక్కొండ: మహిళలు ఆర్థికంగా రాణించుటకు పాల ఉత్పత్తులు ఎంతగానో దోహదపడతాయని జిల్లా డీపీఎం మునిగాల దయాకర్ తెలిపారు. నెక్కొండలోని భారతి సమాఖ్య ఆధ్వర్యంలో మహిళ శక్తి ప్రోగాం కింద గేదలు పెంపకంపై లబ్ధిదారులకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు ఇంటి వద్దనే ఉంటూ జీవనోపాధిని పొందేందుకు గేదెల కొనుగోలుకు రుణాలను అందిస్తుందని చెప్పారు. గేదెల పోషణ, పశుగ్రాసం నిలువ చేసే విధానాలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ మమత, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, సీసీఎస్ రవీందర్, ఏకాంబ్రం, మాణిక్యం, వెంకటయ్య వీవోఏఎస్ వెంకటరమణ, దివ్య, మధుకర్, వివిధ మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన యువకులు



సాయితేజ



రంజిత్



అజయ్‌కుమార్


చెన్నారావుపేట, ఆగస్టు 3 : పట్టుదలతో చదివిన యువకులు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి, కుటుంబ సభ్యులకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన సంఘటన మండల కేంద్రంలో శనివారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. చెన్నారావుపేట గ్రామానికి చెందిన రాజోజు సాయితేజ తన అన్నయ్య రవితేజ ప్రోత్సాహంతో టీజీపీఎస్‌సీలో పరీక్షరాసి రాష్ట్రంలో 23వ ర్యాంకుతో ఏఈఈ ఉద్యోగాన్ని సాధించాడు. ఉప్పుల రంజిత్ అనే యువకుడు అమ్మ ప్రోత్సాహంతో టీజీపీఎస్‌సీ పరీక్షరాసీ రాష్ట్రంలో 800ర్యాంకుతో పంచాయతీరాజ్‌శాఖలో ఏఈఈ ఉద్యోగం సాధించాడు. అలాగే అమ్మానాన్న ప్రోత్సాహంతో కోరే అజయ్‌కుమార్ అనే యువకుడు టీజీపీఎస్‌సీ పరీక్షరాసి రాష్ట్రంలోనే 324వ ర్యాంకుతో ఏఈఈ ఉద్యోగంసాధించాడు. తమకు కేటాయించిన శాఖల్లో ఉద్యోగ బాధ్యతలను తీసుకున్నట్లు శనివారం యువకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలను సాధించిన యువకులను పలువురు అభినందించారు.

స్వచ్ఛదనం - పచ్చదనంను సక్సెస్ చేయాలి

వర్ధన్నపేట, ఆగస్టు 3 : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5 నుండి 9వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం - పచ్చదనంను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరమణ అధ్యక్షతన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేసే మొక్కలను ప్రతీ ఒక్కరు నాటే విధంగా చూడడంతోపాటు వాటిని పరిరక్షించి చైతన్య పరచాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ ధనలక్ష్మీ, ఏఈ రాజేందర్‌రెడ్డి, ఏపీవో నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


• పర్వతగిరి: ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శంకర్ అన్నారు. శనివారం ఈమేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామంలోని పది ముఖ్యమైన పనులను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అవగాహన కల్పించడానికి గాను విద్యార్థులతో ర్యాలీలు, వ్యాసరచన పోటీలను నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి, ఎంపీవో శ్రీనివాసులు, ఏపీవో సుశీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా దయాకర్



నెక్కొండ, ఆగస్టు 3 : మండల ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా గడ్డం దయాకర్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. నెక్కొండ ఎంపీడీవోగా విధులను నిర్వహించిన వీరేశ్ గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. సూపరింటెండెంట్‌గా విధులను నిర్వహిస్తున్న దయాకర్‌ను ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలను చేపట్టాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

నర్సంపేట మునిసిపాలిటీ ఏఈగా రాజేశ్



రాజేశ్‌కు పూలబొకె అందజేస్తున్న చైర్‌పర్సన్

నర్సంపేట, ఆగస్టు 3: నర్సంపేట మునిసిపాలిటీ ఏఈగా రాజేశ్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మునిసిపాలిటీలో ఏఈగా పని చేసిన శాంతి స్వరూప్ పాల్వంచ మునిసిపాలిటీకి బదిలీపై వెళ్లారు. అక్కడి మునిసిపాలిటీలో పనిచేసిన రాజేశ్ నర్సంపేట మునిసిపాలిటీ ఏఈగా బదిలీపై వచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పర్వతగిరి, ఆగస్టు 3: మండలంలోని చింతనెక్కొండ, ఏనుగల్లు, చౌటపెల్లి, పర్వతగిరి గ్రామాల్లోని సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ చంద్రమౌళి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో 33కేవీ లైన్ నిర్వహణ పనులకు గాను సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

256 కిలోల గంజాయి పట్టివేత

5వ పేజీ తరువాయి

పట్టుకునే ప్రయత్నం చేయగా భూపాలపల్లికి చెందిన బానోత్ బాబు కుమారస్వామి, నస్కరి కుమారస్వామి పట్టుబడగా మహబూబాబాద్‌కు చెందిన జలేందర్, భూపాలపల్లికి చెందిన అంగోతు రాజేందర్, తూర్పుగోదావరికి చెందిన ముకుంద్ పరారైనట్లు కమిషనర్ తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి గంజాయితో పాటు కారు, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టుబడిన ఇద్దరు నిందితులు డ్రైవర్ వృత్తి చేస్తూ పరారైన ముగ్గురితో కలిసి ఆంధ్రాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేవారని ఆయన తెలిపారు. ఇదే క్రమంలో 256 కిలోల గంజాయి ఆంధ్రాలో గంజాయి కొనుగోలు చేసి 128 ప్యాకెట్లు చేసి కారులో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో డీసీపీ రవిందర్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, ఎస్‌టీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, సీఐలు రవికుమార్, సార్ల రాజు, రమణమూర్తి, ఎస్‌ఐలు శరత్‌కుమార్, భాను ప్రకాశ్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు. కాగా, గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్, నర్సంపేట ఏసీపీలు, సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ అభినందించారు.

కోనాపురంలో విద్యుదాఘాతంతో ఒకరి మృతి



భాస్కర్ (ఫైల్)

వర్ధన్నపేట, ఆగస్టు 3 : విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతిచెందిన సంఘటన శుక్రవారం రాత్రి వర్ధన్నపేట పట్టణ శివారు 7వ వార్డు కోనాపురంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం కోనాపురానికి చెందిన ఎలికట్టె భాస్కర్ (45) అనే కూలీ పనులు ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో, అప్పుడే వచ్చిన గాలిదుమారం, వర్షానికి ఇంటికి విద్యుత్ సరఫరా చేసే వైరు తెగిపోయి చెట్టు నుంచి వేలాడుతోంది. వర్షానికి కరెంటు పోవడంతో వైరు తెగిన విషయాన్ని గమనించని భాస్కర్ ఇంట్లోకి వెళ్లేందుకు ముందుకు రాగా, వైరు మెడకు తాకడంతో దానిని తొలగించేందుకు యత్నిస్తున్న క్రమంలో అప్పుడే కరెంటురావడంతో విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు వర్ధన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టానికి తరలించారు. కాగా, మృతుడి కుటుంబాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణవరద రాజేశ్వర్‌రావులు వేరువేరుగా వెళ్లి పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకుంటామని, ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

చెన్నారంలో బట్టలు ఆరేస్తుండగా..



కొమ్మాలు(ఫైల్)

వర్ధన్నపేట రూరల్: దండెంపై బట్టలు ఆరవేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని చెన్నారంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చెన్నారం గ్రామానికి చెందిన అమ్మరాజు కొమ్మాలు (70) అనే వృద్ధుడు ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డుకు ఏర్పాటు చేసిన దండెంపై తన బట్టలను ఆర వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్టుమార్టానికి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుడుంబా రవాణాదారుడి అరెస్టు

నర్సంపేట టౌన్, ఆగస్టు 3 : నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఖానాపురం మండలం అశోక్‌నగర్ సమీపంలో గుడుంబాను అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ సీఐ నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు శనివారం తనిఖీలు చేపట్టారు. గుడుంబా రవాణా చేస్తున్న దరావత్ తండాకు చెందిన దారావత్ నరేష్‌ను అదుపులోకి తీసుకొని ఆక్టివా వాహనాన్ని, 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నెక్కొండ మండలం అలంకానిపేటలో అక్రమంగా రవాణా చేస్తున్న 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని చెరువుముందరి తండాకు చెందిన జరుప్పల మోతీరాంపై కేసు నమోదు చేసి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుక్నుట్లు ఎక్సైజ్ సీఐ వివరించారు. ఈ తనిఖీల్లో ఎస్సై శార్వాణి, సిబ్బంది లింగేశ్వర్, సురేందర్, స్వర్ణలత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

18న టాస్ రాష్ట్ర సమావేశం

వర్ధన్నపేట, ఆగస్టు 3 : తెలంగాణ అంబేడ్కర్ సంఘం(టాస్) రాష్ట్ర ప్రతినిధుల సమావేశం ఈ నెల 18న వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు టాస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనకు క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి జిల్లా, మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

జాలు బంధం కాల్వ పూడికతీత పనులు ప్రారంభం

ఖానాపురం, ఆగస్టు 3 : మండలంలోని పాకాల ఆయకట్టు జాలుబంధం కాల్వ పూడికతీత పనులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు శనివారం ప్రారంభించారు. పనులను ఐబీడీ రమేశ్, ఏఈ శ్వేత ఓబీసీ చైర్మన్ ఓర్సు తిరుపతి ప్రారంభించారు. కాల్వలో పెరిగిన చెట్లు తొలగించి, కాల్వ గండ్లను పూడుస్తామని ఐబీడీ రమేశ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి తేలు కాటు

చెన్నారావుపేట, ఆగస్టు 3 : మండల కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శికి తేలు కాటు వేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చెన్నారావుపేట గ్రామంలో పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శి వికాస్‌గౌడ్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో కార్మికులతో కలిసి వికాస్ పనిచేస్తుండగా తేలు కాటు వేసింది. వెంటనే ఆయనను చికిత్స కోసం ప్రాథమిక ఆస్పత్రికి కారోబార్ సురేష్ తరలించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

రాయపర్తి, ఆగస్టు 3 : కుటుంబ కలహాలతో వ్యక్తి పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గణేష్ కుంట తండాలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గణేష్ కుంట తండాకు చెందిన మునావత్ సూక్య కంసాలి దంపతుల కుమారుడు మునావత్ వెంకన్న(33) ఇంట్లో చిన్నచిన్న గొడవలతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. మృతుడి తండ్రి సూక్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సంగెం, ఆగస్టు 3: పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నల్లబెల్లిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. ఇదేగ్రామానికి చెందిన కొట్టం దామోదర్(35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంతకాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల షుగర్ వ్యాధి ఎక్కువగా కావడంతో తీవ్ర మనోవేదనతో ఇంట్లో ఎవరూలేని సమయంలో గత నెల 30న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే చికిత్సకోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, కూతురు ఉంది, కాగా, మృతుడి తల్లి రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.